# సంకల్పం

“సోమయ్యతాతా మీ ఇంటికి మిలట్రీవోడు వస్తుండు” అన్నాడు పశువులకాపరి పకీరు. ఆడి వయస్సు పన్నెండుంటాది. ఆ గ్రామానికి కోసుడు దూరంల ఒంటరిగానే పశువుల్నిమేపుతూ బిళ్ళా కర్ర ఆడుకుంటుండు. అంతల రయ్యిమని దూసుకుంటూ వచ్చి ఓ జీపు ఆడ ఆగినాది. ఆగక యేం సేత్తాది, ముందు మట్టి రోడ్డన్నానేదు. మూడేండ్ల కిందట వరదలకు కొట్టుకుపోనాది. జీపు యేగానికి దుమ్ములేసి ఆకాశంలా మేఘంల అలముకుంది.

‘ఓర్నాయనోయ్! పోలీసులాగున్నాడు’ భయపడి ఓ సెట్టు సాటున దాగుండిపోనాడు పకీరు. జీపు శబ్దానికి పశువులు సెల్లాసెదరైనాయి. ఆకాశంమీద సూరీడు నడినెత్తినున్నాడు. ఎండపెళపెళ లాడుతోంది. అది భాద్రపదమాసమైనా వానల్లేక పచ్చగా వుండవలసిన పైర్లు లేవు. భూమి ఎండి పగుళ్ళిచ్చినాది.

అక్కడకు దగ్గర్లో అంటే పది కోసుల దూరాన ఓ బస్తీ వుంది. అక్కడేదైనా దొంగతనం జరుగుతే పోలీసోళ్లు ఈ ఊరి మీద పడతారు. నలుగురైదుగుర్ని చావమోది జీపుల తీసుకెళ్ళి బొక్కల తోస్తారు. ఊరి పెద్దలు ఆర్నిడిపించుకొత్తారు. ఏనుగుల్లా ఎల్లినోళ్లూ పీనుగుల్లా వస్తరు. ఈడ అంతా కాయకట్టం సేసుకు బతికేటోళ్లే కాని పోలీసోళ్ళకు ఈల్లే దొంగలని డౌటు.

జీపు నుండి దిగిన ఆ సామి సుట్టూ సూసినాడు. కనుచూసు మేరల ఎటూ వూరునేదు. ముందుకి రోడ్డునేదు. పకీరుకి కాస్తధైర్యం వచ్చినాది. ఈడు ఖాకీ డ్రెస్సులనున్నా పోలీసోడు కాడు. ఆల్లు అయితే ముగ్గురో నలుగురో లాఠీలు పూపుకుంటూ దిగుతారు. అడ్డదార్న వూర్లోకివెళ్తారు. పకీరు సెట్టుసాటునుంచి బుర్ర యివతలకు పెట్టి సూసినాడు. ఆ ఆసామికి కనుపించేసినాడు.

“ఏ అబ్బాయి! ఇలారా!”

పకీరు గుండెల్లో వణుకు పుట్టినాది. నిక్కర్ల ఒంటేలుకైనాది. పరుగు లంకించుకుందాం అనుకున్నాడు. అంతల ఆ ఆసామి ఈడి కాడ కొచ్చి “కామన్న వలసయేది? అక్కడ సోములు నాయుడున్నాడా?” భోగట్టా నేసినాడు.

అతగాడు మంచిగ మాటాడితే పకీరు గుండె కుదుట పడినాది. ఊరెటో సెయ్యిసాపి సూపినాడు. అది అడ్డదారి కాదు. ఆడు సూపిన దార్న సైకిళ్ళు పోతాయి. ఊర్లోకి సేరడానికి కాస్త టైము పడతాది.

సోమయ్య తాత కొడుకు మిలట్రీలో ఉన్నాడు. ఈ అయ్య ఆడికోసం వచ్చి ఉంటాడనుకున్నాడు పకీరు. అతగాడు ఆబాటను ఎక్కగానే అడ్డదోవన పరుగు తీసి సోమయ్య ఇంటికాడికెల్లి ఈదిలోంచే "ఓ తాతా! మీ యింటికి మిలట్రీవోడు వస్తుండు" అని బిగ్గరగా కేకేసి వచ్చినంత యేగంగానే తిరిగి పారిపోనాడు.

సోములునాయుడికి పుట్టెడు సెవుడు. పకీరేటన్నాడో యినిపించనేలేదు. పక్కను వున్న మనమడిని కేకేసి 'యేందిరా పకీరు గాడొచ్చినాడు. యేటి సెప్పినాడు?" అని అడిగాడు.

"తాతా! మిలట్రీవోడు వస్తుండట." తాత సెవుల్లో బిగ్గరగా అన్నాడు. ఈ సందడికి సోములునాయుడి కోడలు సత్తెవతి బయటకొచ్చినాది. ఆమె గుండెలు గుబేలుమన్నాయి. సమయానికి పెనిమిటి కూడా వూర్లోనేడు. ఆ వచ్చినతడు ఏ సావు కబురు సెప్పుతాడో, మామకేటి సెప్పాలా అని దీనంగా అతగాడి రాకకు నిరీక్షిస్తూ గుమ్మంల నిలుసున్నాది.

మిలట్రీల వున్న అబ్బాయి రావలసిన టైము. ఆడు ఏడాది కోపారి వొచ్చి పదిహేను దినాలుండి యెల్లిపోతాడు. మరి ఆడురాటం లేదా? వేరెవరో ఎందుకొస్తున్నట్లు? సోములునాయుడి గుండెల్లో దడ పుట్టినాది. ఆరేళ్ళ యెనక్కు పోయింది మనస్సు.

★ ★ ★

"ఏందిర సోములూ! నీ బొట్టెడు యెంకటేసు వచ్చినాడేటి?" దారిల కనుపించి ముసలయ్య బోగట్టసేసినాడు.

"నేదురయ్య ఇంతవరకు రానేదు. నేడో రేపో రావాల్న, ఎందుకట్ట అడిగినావు? ఆడొస్తే మీ యింటికి రాడా?"

"అదే, ఎవరో మిలట్రీవోడు మీయింటికొచ్చినాడని తెల్సినాది. యెంకటేసు కోసమేమోనని అడిగినాను."

మిలట్రీవోడా? ఎవరై వుంటాడు? యెంకటేసు ఇంకారానేలేదే? అప్పుడే ఆడికోసం ఎవరో వచ్చినారా? నేక ఆడేదైనా కబురంపినాడా?

సోములునాయుడు ఆలోచిస్తూనే పరుగుపరుగున ఇంటికొచ్చినాడు. గుమ్మంలో కోడలు సత్తెవతి కూకున్నది. ఆమె వొడిలో మనవడేడుస్తుండు. పనులొగ్గేసి యేల కూకుండిపోనాది?

"కోడలా, మనింటికెవరో వచ్చినారంట?"

"మామయ్యా!" అది మాటలాలేదు. దుఃఖంతో ఆమె గొంతు బొంగురుపోనాది. అంతలోనే ఆమె సద్దుకున్నది.

"ఔను మామయ్యా! ఎవరో వచ్చినాడు. ఏలకొచ్చినాడో నాకు తెల్దు. మన యెంకటేశం కోసం కాబోలు. అతగాడు ఇంగ్లీసుల మాటలాడినాడు. నాకొక్కముక్క బోధపడనేదు" అంది. మరేం ప్రశ్న వినవస్తుందోనని ఆ అమ్మి కొడుకుని సంకలేసుకొని లోనకెళ్ళింది.

సంగతి తెలియక సోములునాయుడు గిలగిలలాడిపోనాడు. ఇంతల సత్తెవతి గ్లాసులో మజ్జిగ తెచ్చి ఇచ్చింది. అత్తగారికెలాగుందో సెప్పినాది. "అతగాడేదో ఉత్తరం ముక్క యిచ్చినాడు. నీ కొడుకు వస్తే తేలుతాది" అంది ఖాళీ గ్లాసు తీసుకుంటూ.

సోములునాయుడు పెద్దకొడుకు పట్నంనుండి మూడుగంటల వేళ తిరిగొచ్చినాడు. ఈది గుమ్మంలోనే భర్తను సూసి తనెంట పెరటిలోనికి తీసుకుపోయింది సత్తెవతి. మిలట్రీవోడు సెప్పిన యిసయం సెప్పి అతగాడిచ్చిన కవరు భర్త చేతిలో ఎట్టి "నా మరిది లేడండి" అంటూ బోరున ఏడ్సినాది. ఈరేసంకి తెలివి తప్పినంతైనాది. నింపాదిగా తేరుకుని "అయ్యకీ సంగతి తెలిసినాదా?" అడిగినాడు.

"నా నోటితో సెప్పలేకపోనానండి. ఈ సంగతి తెలుస్తే అత్తమ్మ యిప్పుడే గుటుక్కుమంటాది. కొడుక్కోసం కలవరిస్తున్నాది. మీ అయ్యవింటే అతగాడికి పిచ్చెక్కిపోతాది. అందుకనే ఇంగ్లీసుల సెప్పినాడు ఓ కాగితం ముక్క యిచ్చినాడు అని సెప్పిన."

"సత్తెం! ఈ సంగతి ఎప్పటికైనా సెప్పవలసిందేగా! ఎంతకాలం దాయగలం"

"అదేం మాటండీ! మీ అమ్మకెట్టా వుందో మీకెరికనేదా? అమెను సేసేతులా సంపుకుంటారా? ఎన్నాళ్ళైనా దాచుదాం. మీరు తొందరపడకండి. ఆ మాటసెప్పి ఆళ్ళ సావుకి కారణం కాకండి."

భార్య సెప్పింది సబబుగానే ఉందనుకున్నాడు. ఆ ముసలి ప్రాణాలు కాపాడాలంటే మరో దారి నేదు. ఇద్దరూ పరిపరి యిధాల ఆలోసించినారు. ఆ తరువాత ఈరేశం ఓ కాగితంమీద నాలుగు ముక్కలు గెలికినాడు.

"అయ్యా! మనింటికి మిలట్రీ వోడు వచ్చినట్టు సత్తెం నీకు సెప్పినాది కాదా?"

"యీరేశం! ఆ సంగతి సెప్పినాదిరా. నీ తమ్ముడు రానేదు. ఈడెందుకొచ్చినట్టు, దాన్కి తెలియలేదంట."

"ఔనులే, దానికి మాత్తరం ఎట్టా తెలుస్తాది? ఆడు ఇంగలీసుల సెప్పినాడంట. మన యెంకటేశం ఉత్తరం పంపినాడు ఆరిసేత."

"ఏటి?! రేపో మాపో రావలసినోడు ఉత్తరం ఏల పంపినాడు?"

"నీకంతా తొందరే అయ్యా! తమ్ముడు ఇంత బేగిరాలేడంట. ఆడి పని బాగుంది నాదని ఆడ్ని పైలట్ సేస్తున్నారంట"

"పైలట్టా? అంటే అదేటిరా?"

"అది పెద్ద ఉద్యోగం. సూడు రోడ్డుమీద బస్సులూ, లారీలు నడుపుతారే ఆళ్ళని డ్రైవర్లంటారా? అట్టాగే ఆకాశంలో యిమానాలు నడిపే వోర్ని పైలట్లంటారు. ఆడ్ని ట్రైనింగుకోసం రష్యా పంపిస్తున్నారంట. ఆక్కడు మూడు నెలలుండాలంట. అందుకే తమ్ముడు ఇప్పట్లో రాలేడంట."

"ఏటీ, మూడునెలల వరకు రాడా? అమ్మకు బాగోనేదని ఆడికి తెలియదా?"

"ఉద్యోగం అన్న తరువాత బాధ్యతలు తప్పుతాయా? తమ్ముడికి పెద్ద ఉద్యోగం అయింది ఆడు ఆకాశంలో తిరుగుతాడని తెలిస్తే అమ్మ సంబరపడిలేసి కూసుంటాది. మరేటనుకున్నావు."

తండ్రిని నమ్మించినందుకు ఈరేశం అతని భార్య తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు. మరుసటి రోజు తండ్రిని పట్నం తీసుకెల్లి మిలట్రీ వాడిచ్చిన రెండులక్షల రూపాయల డ్రాఫ్టుని బ్యాంకుల తండ్రి పేర్న ఎకౌంటుల ఏసినాడు. "అయ్యా! నెలనెలా తమ్ముడు పంపే డబ్బు మరి మనియార్డర్ల రాదు. సువ్వో కాగితం మీద సంతకం సేత్తే ఈ బ్యాంకోళ్లు ఇత్తారు. ఇప్పుడు రెట్టింపు వస్తది."

మూడు నెలలంటే ఎంత? గిర్రున కాలచక్రం తిరుగుతూంటే దసరా దగ్గర పడినాది. సోములు నాయుడు రోజులు లెక్కించుకుంటూన్నాడు. అతగాడికి రాత్రిపగలూ ఒకటే కలా, ఒకటే ఆలోచన. తన కొడుకు యెంకటేసు ఆకాశంమీద రథం తోలుకుపోతావుంటడు. సోములునాయుడి దృష్టి భూమ్మీద నేదు. కనిపించిన ప్రతివారికీ యెంకటేసు గురించి సెప్పటమే.

యెంకటేసు సచ్చిపోనాడని ఆ వూర్ల సానామందికి తెలుసు. అస్సాములో తీవ్రవాదులు విజృంభించి ఆ రాష్ట్రంలో కొంత భాగం కైవసం చేసుకొని స్వతంత్రదేశంగా ప్రకటించాలనే ప్రయత్నంలో హత్యలూ, దోపిడీలు చేస్తూ ప్రజలలో భీతావహం కల్గిస్తున్నారు. వారిని అణచి వెయ్యడానికి వెళ్లిన పోలీసులను మిలట్రీవాళ్లను దొంగదెబ్బతీసి కాల్చి వారివద్ద గల ఆయుధాలను ఎత్తుకుపోతున్నారు. అయినా మిలట్రీవారు ఆ వేర్పాటువాదుల్ని పట్టుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి ట్రూపులో వెంకటేశం కూడా ఉన్నాడు. వీరు తీవ్రవాదుల రహస్యస్థావరంలోకి ప్రవేశించారు. వారిని లొంగిపొమ్మని చెప్పారు. అయితే అందుకు మారుగా వారు తుపాకీ కాల్పులు మొదలుపెట్టారు. మిలట్రీవారు ఎదురు కాల్పుల్లో తీవ్రవాదుల కమాండరు, మరో ఆరుగురు నేలకొరిగారు. మిగిలినవారు తోక జాడించారు. ఆ పోరులో వెంకటేశానికి బాగా గాయాలై మిలట్రీ ఆసుపత్రిలో కన్ను మూసాడు.

కాని ఆ విషయం సోములు నాయుడికి ఎవరూ చెప్పలేదు.

"కోడలా! దసరా మరింక ఎన్నిరోజులు?"

"మరే మామయ్యా! వారం రోజులుంది. మరిది దసరాకు ఆటో ఇటో వస్తాడు. నువ్వు నిబ్బరంగా ఉండు."

"అదేటిపిల్లా దసరా ఎల్లిపోయినాక వస్తాడా? నువ్వు సూత్తుండు. ఆడు దసరాకు ముందలే వస్తాడు. పండగకు రాకుండా ఎట్టా ఉంటాడు?"

సత్తెవతి అటు తిరిగి కన్నీళ్లు వొత్తుకొని యెల్లిపోయింది. ఆమెకు దిగులుగానే ఉంది. మామయ్యకు ముందేటి సెప్పాలి?"

దసరా వొచ్చింది, యెల్లిపోనాది.

సోములు నాయుడి ఆరాటం ఎక్కువైంది.

"అయ్యా! నేను పట్నం ఎల్తే పోస్టుమేను కనుపించి ఉత్తరం ఇచ్చినాడు. తమ్ముడు రాసింది."

..............

"సదవమంటావా?"

"ఏటి సదువుతావు? నాకు ఈలు కుదరనేదు. అందుకు దసరాకు రానేకపోయినాను. అమ్మకెట్టాగున్నాది? అనేగా ఆడురాస్త?"

"సరిగ్గా ఊహించావు అయ్యా! ఆడి ఆఫీసర్లు ఆడితో అన్నారంట యెంకటేశం నీకిప్పుడే కదా పైలట్ ట్రైనింగు ఇప్పించినాము. మరో...."

ఎన్ని నెలల వరకు తమ్ముడికి రావటానికి ఈలు కుదరదో తండ్రికి సెప్పాల్నా, రెండునెలలా, మూడు నెలలా లేక ఆరసంవత్సరమా?

"ఆగిపోనావేటి? సంక్రాంతికి మరిది వస్తున్నట్టు రాసినాడని సెప్పినావుగా? మామయ్యా! మరిదికి అత్త సంగతి తెల్దా? అమ్మకు మంచి మందులిప్పించండి. పట్నంల డాకటేరుకి సూపించండి. నాలుగువేలు బ్యాంకులో ఏసినాను అని రాసినాడంట. సదవయ్యా! మీ అయ్య యింటాడు" అంది సత్తెవతి.

"ఏటి సేత్తడు? ఇటు అమ్మ అయితే అటు ఉద్యోగం. తలమ్ముకున్నాక మన సేతుల్లవుందా ఎప్పుడు పడితే అప్పుడు పొర్రావడానికి? నేను ముందే సెప్పినాను అడ్ని మిలట్రీల పంపమాకు అని" అంది సత్తెవతి.

"నువ్వుసెప్పింది నిజం కోడలా? ఇటు కన్నతల్లి అయితే అటు అందరికి తల్లి లాంటి దేశం. పోనీలే సంకురాత్తిరికి కొస్తానన్నాడు కదా? అప్పుడు మాత్తరం ఏటి గ్యారంటీ! మరేటేదో జరిగినాదనుకో. నాకేయిచారంలేదు. ఎక్కడోఅక్కడ ఆడు బాగున్నాడు. కాని కోడలా మీ అత్త ఆడికోసం కన్నుల్ల ఒత్తులెసుకు కూకుందే. వచ్చే ప్రాణమూపోయే ప్రాణము. మీ అత్తమ్మకు కాస్త ధైర్యంసెప్పు."

★ ★ ★

కొడుకు గురించి కలవరిస్తు సోములునాయుడి భార్య చచ్చిపోనాది. ఊరువూరంతా వచ్చారు. ఎక్కడో దూరంగా సదువుకుంటున్న సోములునాయుడి మూడో కొడుకు సుందరేశం వచ్చినాడు. రానిది మిలట్రీలోని యెంకటేసు మాత్రమే.

"సోములూ! నేనూ నీ పెద్ద కొడుకు పట్నంల మిలట్రీ ఆఫీసుకెళ్ళినం. పెద్ద దొరగారికి యెంకటేశం తల్లి సనిపోనాదని యెంకటేసుని వెంటనే పంపించండని కోరినాడు. యెంకటేశం బోర్డర్ల యెక్కడో వున్నాడంట. అక్కడ రోజూ ఫైరింగులేనట. ఆడెటు కాసి వున్నాడో తెల్దట. అయితేనేం అన్ని సోట్లకు వైర్‌లెస్ యిత్తాం. యెంకటేశుని యెంటనే రప్పిత్తాం అన్నాడు ఆ దొర" ఆవూరి మోతుబరి రైతు సెప్పినాడు. ముందుగ అందరూ సోములునాయుడికి యెంకటేశు సావుగురించి సెప్పరాదనే అనుకున్నారు.

భార్య పోయిందన్న బాధ ఒక యేపు అయితే ఇంత జరిగినా కొడుకు జాడ తెలీలేదన్న బాధ మరోయేపు. సోములునాయుడు మంచం ఎక్కినాడు.

సంక్రాంతి వచ్చినా యెంకటేశురాలేదు. సోములునాయుడికిబాధ వుందో లేదో తెలీదుగాని అతను నిర్లిప్తంగా ఉన్నాడు.

"సత్తెం ఇంకా అయ్యను మభ్యపెట్టటం నాతరం కాదు. ఏదౌతే అది ఔతుంది. యెంకటేశు చచ్చిపోయినట్టు అయ్యకు సెప్పేత్తాను."

"అయ్యో! అంత పని సేయకండి. మామయ్య పరిస్థితి సూత్తన్నారుగా. ఆ మాట యింటే మీ అయ్య గుండె ఆగిపోతది. నేకుంటే అతడికి పిచ్చెక్కిపోతది. మనం అనాధలైపోతాము. ఈ యిసయం ఎప్పుడో అప్పుడు మామకు తెలుస్తది కాదనను. కాని ఇప్పుడు సెప్పితే ఇప్పుడే అతని ప్రాణానికి ముప్పు" అంది సత్తెవతి. ఈరేశానికి ఏటి సెయ్యాలో ఏటి సెయ్యకూడదో తెలియలేదు.

అయితే ఆ రహస్యం ఎంతో కాలం దాగలేదు. సోములనాయుడి మూడో కొడుకు ఒకనాడు ఏడుస్తూనే ఇంట కాలుపెట్టాడు.

"అయ్యా! అంతా అయిపోయింది. యెంకటేసు అన్నయ్య తీవ్రవాదులతో పోరాడుతూ అస్సముల చచ్చిపోయినాడంట. పెద్దన్న వదినలు దీన్ని గోప్యంగా ఏలదాసినారో తెల్దు" తండ్రి మీద పడి వలవల ఏడిసినాడు.

సత్తెవతి మరిదిని లోనకు తీసుకుపోయింది. అలా ఎందుకు దాచవలసి వచ్చిందో సెప్పినది. "సుందరం! ఆ మాట ఆనాడే సెప్పి వుంటే మీ అమ్మ సచ్చిపోయేది. నీ సదువు సాగేది కాదు."

సోములునాయుడు కోపంగా లేచినాడు. పళ్ళు పటపట కొరికినాడు. ఏదో అనాలనుకున్నాడు. అంతలోనే తమాయించుకున్నాడు. కాని అతనికి తెలివి తప్పిపోనాది. ఈరేశం చన్నీళ్లు తెచ్చి తండ్రి ముఖం మీద జల్లినాడు. తుండు గుడ్డతో గాలిసేసినాడు.

కొంతసేపటికి సోములునాయుడు ఈ లోకంల పడినాడు.

"ఎందిరయ్య! నీ తమ్ముడు కుక్కసావు చచ్చినాడా? మాతృభూమి కోసం ప్రాణాలిచ్చినాడు. అలాంటి అద్దురుట్టం ఎంతమందికి దొరుకుతుంది? ఆ మాటయింటే మేం సచ్చిపోతామా? అమ్మ యింటే ఎంత సంబరపడేది. తను ఒక వీరమాతనని గర్వించేది కదరయ్య. ఓర్నాయన ఆడు సచ్చిపోయినందుకు నాకు ఇచారం లేదుర. అదేటి ఓట్టిచావా? ఆడు చేసింది త్యాగం, బలిదానం, ఎనకటికి అలాగెందరో సేయబట్టే కద మనకీనాడు సొరాజ్యం వచ్చినాది" అన్నాడు.

"అయ్యా! నాకు మిలట్రీల వుద్యోగం దొరికినది. నేను సేరాలనుకుంటున్నా. అన్న పూర్తి సేయంది నేను సేత్తను." అన్నాడు సుందరం.

"శభాష్‌రా బిడ్డ. తప్పక సేరు"

"అదేంటి మామయ్యా! నా మరిది ఒకడు మిలట్రీలో చచ్చిపోయినాడు. ఈ మరిదిని కూడా దూరం సేత్తావా? అది కుదరదు. ఆడి సదువు అయిపోంగానే ఏదో ఉద్యోగం ఈడనే సూసుకుంటాడు. పెళ్ళి సేసుకుంటడు. పిల్లా పాపతో సుఖంగా వుంటడు. మనకి మిలట్రీల ఉద్యోగాలు అచ్చిరావు. ఎందయ్యా మీ అయ్యకు సెప్పక అలా పల్లకుంటవేటి? నీకు నీ తమ్ముడి మీద ప్రేమ లేదా ఏంటి? నేక ఆడి సంపాదన మీద అశపడతన్నావా?" సత్తెవతి ఏడిసేసినాది. "పేదాళ్ళమైతేనేం బతికుంటే బలుసాకు తింటాము" అంది మనసులోనే గొణుకుతూ.

"ఛా! అదేం మాటలే కోడలా! అందరూ పల్లకీ ఎక్కేవారే అయితే మోసేది ఎవరు? నీలా అందరు తలబోస్తే మిలట్రీ ఉద్యోగాలు ఎవరు చేస్తరు. దేశాన్ని ఎవరు కాపాడ్తరు? పెళ్లి చేసుకుని పెళ్ళాం పక్కల తొంగుని పిల్లల్ని కనడమే జీవితమా? ఓరయ్యో! తప్పక సేర్రా. ఆ పాకీస్తానోడు పిచ్చి ఏనుగులా కట్టు తప్పినాడు. ఆడికి మీరంతా గుణపాఠం సెప్పండి. ఓరి నాయనా! ఒక్కటి మాత్తరం గుర్తుంచుకో ప్రాణం మీద తీపితో పగవాడికి ఈపు సూపకు, ప్రాణం ముఖ్యంకాదు, మనకు దేశం ముఖ్యం. కనిపించిన శత్రువుని తుదముట్టించు. మీ అయ్య ఆశీస్సులుండాయి. ఎల్లు దేశంకోసం ఏదైనా చెయ్యి" అన్నాడు.

అక్కడ సేరిన జనం సోములునాయుడికి పిచ్చి అనుకున్నారు.

★ ★ ★

ఆ సుందరేశం రావలసిన టయిము అయినాది. ఆడు రానేదు. ఈ ఆఫీసరొచ్చుండు.

"సూడు బాబు! నువ్వెవరివో నాకు తెల్వు. ఏపని మీద వచ్చినావో తెల్వు. మా సుందరేసం కోసం మేం కళ్ళల వత్తులేసుకుని కూకున్నాం. నీవు ఏటి సెప్పాలనుకున్నావో ధైర్యంగా సెప్పు. ఏటి మా సుందరం యుద్ధంలో సచ్చిపోనాడా? నాకు ముందు సెప్పు ఆడు సచ్చిపోకముందు ఎందర్ని మట్టుబెట్టినాడు? ఆడు యుద్ధంల సచ్చిపోయుంటే ఆడు దేశంకోసం సచ్చిపోయిన నా రెండో కొడుకు అవుతాడు. మా పెద్దాడున్నాడే ఆడిసెవుల ఏదీ సెప్పమాకు. ఆడికి నేనంటే ప్రాణం. నా ప్రాణం ఏమౌతుందోనని నాకు నిజం సెప్పడు. నువ్వెల్లిపోనాక ఏదో కట్టుకద సెప్తాడు. తమ్ముడు బతికి వున్నాడని నన్ను మభ్యపెడ్తాడు. నిజం యింటే నేను తట్టుకోలేనని ఆడి బెంగ. ఏటో ఆడు ఓ ఎర్రి మాలోకం. ఈ పాణం పోకుండా వుండిపోతదా?" సోములునాయుడు ఏడ్చేసుండు.

ఆ అధికారి సోములునాయుడి మనోధైర్యానికి ఆశ్యర్యపోయాడు. ఆ తరువాత రెండు చేతులు ఎత్తి దండం పెట్టాడు. తను దుర్వార్త తెచ్చాడు. అది ఎట్లా చెప్పడమా అని మథనపడుతున్నాడు. నీ కొడుకు యుద్ధంలో చచ్చిపోయాడంటే ఏ తండ్రి బాధపడడు? అందరూ వలవలా ఏడుస్తూ వుంటే వాళ్ళను సముదాయించటం ఎలా?

"తాతగారూ! మీ ధైర్యానికి జోహార్లు. మీకీ వార్త ఎలా చెప్పడమా అని బాధపడుతున్నాను. మీ సుందరేశం ఇక మన మధ్యలేడు. అతనిది చావుకాదు. వీర మరణం. దేశంకోసం ప్రాణాలు అర్పించేడు. మీరు రేడియోలో వింటున్నారు. టీవిలో చూస్తున్నాడు. పొరుగునున్న వాడు మూడుసార్లు ఓడిపోయినా ఇంకా మనమీద కాలుదువ్వుతూన్నాడు. ఒక పక్క లాహోరులో సంతకాలు చేస్తూనే, మరో పక్క కార్గిల్‌లోనికి చొచ్చుకొచ్చాడు. మనదేశసేనలు ధైర్యంతో వారికి ఎదురు నిలిచాయి. వారి ఆగడాలను ఆట కట్టించాయి. వందకోట్ల జనాలు హిమాలయాల్లా వాళ్ళకు అండగా నిలిచారు. చివరకు వాడు కార్గిల్ నుండి వైదొలగిపోయాడు. కాదు మనవాళ్ళువాళ్ళను తరిమికొట్టారు. ఎందరో ప్రాణాలను కోల్పోయారు. చివరకు చచ్చిపోయిన వాళ్ళ సైనికుల్నికూడా తీసుకువెళ్లే ధైర్యం చేయలేకపోయారు. ఈ వీరోచితపోరాటంలో కొందరు మన సైనికాధికారులు, సైనికులు వీరగతిని పొందారు. అలా దేశం కోసం ప్రాణాలిచ్చిన వారిలో సుందరేశం ఒకడు. ఒక సమయంలో అతడు ఒంటరి అయ్యాడు. ఐనా ధైర్యాన్నివిడనాడలేదు. పాకిస్తానీ వాళ్ళ పదిబంకర్లను నాశనం చేసాడు. పదిపన్నెండుగురు శత్రు సైనికుల్ని చంపాడు. చివరకు భరతమాత ఒడిలో కన్నుమూశాడు. ఈనాడు దేశం యావత్తు విజ యోత్సవాలు జరుపుకుంటున్నాది. 'కార్గిల్‌లో పోరాటం చేసింది మా సైనికులు కారు, అది జిహాదీలు'అని పాకిస్తానీ బొంకులుబొంకింది. అయితే అన్ని దేశాలు యథార్థాన్ని తెలుసుకున్నాయి. వీరస్వర్గం అలంక రించిన కొందరికి ప్రభుత్వం పరమవీరచక్ర బహుకరించ నిశ్చయించింది. అందులో మన సుందరేశం ఒకడు. మీరు ఢిల్లీ రావాలి. అంతేకాదు ఆర్థిక సహాయంగా మీకు అయిదులక్షలు ప్రభుత్వం ఇస్తోంది."

"మాతృదేశ సేవలో అమరత్వం పొందినందుకు ప్రతిఫలం డబ్బా!?"ఆ డబ్బు మేం ఏటి సేసుకుంటాం. వద్దు. మావాడి బలిదానానికి మూల్యం కట్టకండి" సోములునాయుడు ఏడ్చి సొమ్మసిల్లి పోయాడు.

★ ★ ★

ఆ ఊరిలో హర్షం విషాదం రెండూ ఏకకాలంతో పెనవేసుకున్నాయి.

రెండురోజుల తరువాత దీపావళి, ఊరివారంతా ఆ దీపావళి పర్వం జరుపకూడదనుకున్నారు. అది మరణించిన సుందరేశానికి ఘననివాళి అని సంకల్పించుకున్నారు.

దీపావళి రానే వచ్చింది.

చీకటి పడుతున్నా కోడలు దీపాలు పెట్టలేదు. పిల్లలు టపాసులు కాల్చడానికి ఉత్సాహం కనబరచటంలేదు. ఇరుగుపొరుగులా దృశ్యం అదే. సోములునాయుడు కోడల్ని కారణం అడిగాడు.

"మామయ్యా! మన సుందరేశం చనిపోయాడు కదా. ఈ సంవత్సరం ఊర్లో దీపావళి జరపకూడదని ఊరి పెద్దలు సంకల్పించుకున్నారు" అంది సత్తెవతి.

సోములునాయుడు తారాజువ్వలా లేచిండు. "ఇది నా సుందరేశుకి అవమానం. దేశం మొత్తం మనోడులాంటి వోరు సూపిన సాహసానికి ప్రతీకగా విజయోత్సవాలు జరుపుకుంటూంటే మనూరిలో సీకటా? అలా ఎంత మాత్తరం ఈల్లేదు. నువ్వు దీపాలెట్టు. పిల్లల్ని బాణాసంచా కాల్చుకోని." సోములునాయుడు స్వయంగా రెండు కొవొత్తులెలిగించి ఈదిలో పెట్టినాడు. మామ ఉత్సాహాన్ని నీరుగార్చటం ఇష్టంలేక సత్తెవతి తొందరగా ప్రమిదలు సర్ది దీపాలు పెట్టింది. ఇంటిముందు చిచ్చుబుడ్లు ఎలుగులు చిమ్మెయి. టపాసులు పేలాయి. ఇరుగుపొరుగువారు ఇళ్ళలో నుండి బయటకొచ్చినారు. ఊరు ఊరంతా సోములనాయుడి ఇంటిముందు గుమిగూడారు.

"ఏందిరయ్యా! మనం దీపాలు ఎలిగించకుండా సీకట్ల నుండాలా? మీ నిర్ణయం సరైంది కాదురా. నా కొడుకు నికృష్టపు సావు చావనేదురయ్యా. దేశమాత కోసం తన ప్రాణాలను బలి యిచ్చినాడు. మనం సీకట్ల వుంటే ఆడి ఆత్మ దుఃఖపడుతుంది. అందరూ ఇళ్లల దీపాలెట్టండి. పటాసులు కాల్చండి. ఇవి మామూలు పటాసులు కాదురయ్యా. పొరుగువాడి గుండెల్లో శతఘ్నులై పేలాల. ఓరయ్యో మీరు సేయవలసిన సంకల్పం వేరొకటి ఉంది. మీలో చేవ వుంటే, మూతి మీద నిజంగా మీసం వుంటే ఇంటికొకడిని మిలట్రీలో సేరిపించి దేశమాత సేవ కర్పించండిరయ్యా. అదిరా నేడు మనం చేయవలసిన సంకల్పం.

ఊరి ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఇంటింటా వెలుగులు విరజిమ్మాయి. దీపాలు..... దీపాలే...... దీపాలు.....

(జాగృతి - దీపావళి ప్రత్యేక సంచిక 2002)